క్లుప్తంగా

బైరి నరేష్ అరెస్ట్

భాగ్యనగర్‌కాలనీ: అయ్యప్పస్వామి మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌ను కూకట్‌పల్లి పోలీసులు పీటీ వారెంట్ కింద బుధవారం అదుపులోకి తీసుకున్నారు. డిసెంబర్ 28వ తేదీన కూకట్‌పల్లికి చెందిన ఐలయ్యగౌడ్‌తో పాటు పలువురు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన చర్లపల్లి జైలులో ఉన్న బైరి నరేష్‌ని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కి తరలించి విచారణ చేపట్టారు. అనంతరం జడ్జి ముందు ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: ఆంజనేయనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసాపేట ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ఖైత్లాపూర్, సైబర్ సిటీ, రెయిన్‌బో విస్టా, మైస్టిక్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కేపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో...

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మత్తుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ–సేవా కేంద్రం, వాటర్ ట్యాంక్, సీతమ్మ హోటల్ ఎంఐజీ 480, 644, 646, 648, ఈడబ్ల్యూఎస్ 588, 783, 915, హెచ్ఐజీ 59,60 ప్రాంతాలు, సులభ కాంప్లెక్స్, శ్యామ్ ముఖర్జీ పార్కు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇందూ ప్రాజెక్టు ఫీడర్ పరిధిలోని ఎంఐజీ 614, 615, 47,48, ఫంక్షన్‌హాలు రోడ్డు, టెంపుల్ బస్‌స్టాప్ క్రింది ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మైనార్టీ గురుకులంలో అడ్మిషన్లు షురూ

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల బాలానగర్ బాయ్స్–1 హైదర్‌నగర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 55, క్రిస్టియన్ మైనార్టీలకు 5, బీసీ 10, ఎస్‌సీ 5, ఎస్‌టీకి 3, ఓసీకి 2 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ముస్లిం మైనార్టీలకు 28, క్రిస్టియన్ మైనార్టీలకు 2, బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీకి 1, ఓసీకి 1 సీటు ఉన్నాయన్నారు. బైపీసీలో ముస్లిం మైనార్టీలకు 28, క్రిస్టియన్ మైనార్టీలకు 2, బీసీలకు 5, ఎస్‌సీలకు 2, ఎస్‌టీలకు 2, ఓసీలకు 1 సీటు ఉన్నాయని అదే విధంగా 6,7,8 తరగతుల వారికి కూడా ముస్లిం మైనార్టీ విద్యార్థులకు సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 914029881806, 7989486938, 7569241410, 7331170802లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సమస్యలపై అధికారులతో సమావేశం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్‌లు, కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ అధికారులతో బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ డివిజన్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను అధికారులతో చర్చించారు. అత్యవసరంగా మార్చాల్సిన విద్యుత్ లైన్లు, హైటెన్షన్ లైన్లు, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల గురించి అధికారులకు వివరించారు.

మనూ నూతన విద్యార్థి సంఘం



రాయదుర్గం: ఉర్దూ యూనివర్సిటీ వారసత్వాన్ని విద్యార్థి సంఘం నిలబెట్టాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ సూచించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2022–23 విద్యాసంవత్సరానికి కొత్తగా ఎన్నికైన విద్యార్థి సంఘం పదవీ ప్రమాణ స్వీకారాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎండి ఫైజాన్, ఉపాధ్యక్షుడుగా మహ్మద్ మిస్బాజాఫర్, కార్యదర్శిగా ఫైజాన్ ఎక్బాల్, సంయుక్త కార్యదర్శిగా మారియా హిదాయత్, కోశాధికారిగా ఎండి ఖాసీమ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారికి ఎన్నికైన సర్టిఫికెట్లను వీసీ అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, చీఫ్ రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ అబ్దుల్ అజీమ్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, పరిశీలకులు ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, ప్రొఫెసర్ ముస్తాక్ అహ్మద్ పటేల్ పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు భూములపై హై అలర్ట్

- పెరుగుతున్న భూ వివాదాలు
- అప్రమత్తమైన అధికారులు
- విలువైన భూముల పరిరక్షణకు చర్యలు



కేపీహెచ్‌బీకాలనీలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన విలువైన భూమి

కేపీహెచ్‌బీకాలనీ: విలువైన హౌసింగ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే విలువైన భూములు తమవి అంటే తమవి అంటూ కొందరు కోర్టులను ఆశ్రయించగా మిగిలిన ఖాళీ స్థలాల పరిరక్షణకు అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలికి కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీ పరిధిలో వందల కోట్ల విలువచేసే భూములు ఉన్నాయి. 1968లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర గృహ నిర్మాణ మండలి కోసం భూసేకరణ ద్వారా కూకట్‌పల్లి గ్రామంలో వందలాది ఎకరాల భూములను సేకరించింది. పేద, మధ్యతరగతి, ఉన్నత వర్గాల కోసం ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి విక్రయించింది. అయితే గత దశాబ్ద కాలంగా కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో మిగిలిన ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్నుపడింది. దీంతో కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డుకాలనీ పరిధిలోని విలువైన భూములను కాపాడుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

- కూకట్‌పల్లి గ్రామం పరిధిలోని ఖైత్లాపూర్ వద్ద సుమారు 30 ఎకరాల భూమిని కొందరు ఇటీవల కాలంలో తమ భూమిగా పేర్కొంటూ విక్రయాలు చేసేందుకు యత్నిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. అక్రమంగా హౌసింగ్‌బోర్డు భూముల్లో పాగా వేసేందుకు జరుగుతున్న కుట్రలపై అప్రమత్తమయ్యారు.
- హౌసింగ్‌బోర్డు అధికారులు భూసేకరణ ద్వారా భూముల యజమానులకు 1968లోనే డబ్బులు చెల్లించి భూములను తీసుకున్నప్పటికీ రెవెన్యూ రికార్డులలో మాత్రం ఇంకా గత పట్టాదారుల పేరుతో పహాణీ పత్రికలు లభ్యమవుతుండటం కొత్త వివాదాలకు తావిస్తోంది.
- పాత రెవెన్యూ రికార్డులతో పాటు కొత్త రెవెన్యూ రికార్డులలోను హౌసింగ్‌బోర్డుకు చెందిన పలు సర్వే నంబర్లలోని భూములు పట్టాదారులుగా పాత యజమానులతో జారీ అవుతుండటంతో వారి వారసులమని పేర్కొంటూ మార్కెట్‌లో విక్రయానికి పెట్టినట్లు తెలిసింది.
- గతంలో హౌసింగ్‌బోర్డు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి హౌసింగ్‌బోర్డు ఆనవాళ్లు కనిపించకుండా చేసి ప్లాట్‌లుగా మార్చి పలువురు కొనుగోలుదారులకు భూములను అంటగట్టేందుకు యత్నిస్తున్నారు.
- కాముని చెరువు శిఖం మొదలుకొని నూతనంగా నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి వరకూ ఉన్న హౌసింగ్‌బోర్డుకు చెందిన భూములలో సుమారు 38 ఎకరాలపై కబ్జాదారుల కన్నుపడినట్లు అధికారులు గుర్తించారు.
- కూకట్‌పల్లి గ్రామ సర్వే నం.911, 912, 913, 936, 940 నుంచి 944, 990, 993, 926 నుంచి 930, 990, 910,925, 934, 935, 971లలో సుమారు 38 ఎకరాల హౌసింగ్‌బోర్డు భూమిపై పూర్తి హక్కులు తమవేనంటూ హౌసింగ్‌బోర్డు అధికారులు ప్రకటించుకోవాల్సి వచ్చింది.
- స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులను సంప్రదించి అట్టి సర్వేనంబర్లలో ఎలాంటి భూలావాదేవీలకు అవకాశం ఇవ్వరాదని కోరడంతో పాటు బ్లాక్ లిస్ట్‌లో పెట్టించారు.
- హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తూ తమ స్థలాలను పరిరక్షించుకోవడంతో పాటు క్షేత్ర స్థాయిలో నిఘాపెట్టి ఖాళీస్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.
- హౌసింగ్‌బోర్డు ప్రాంతంలో ఎక్కడ చూసినా గజం ధర లక్ష రూపాయలకు తక్కువ లేకపోవడంతో కబ్జాదారుల నుంచి భూములను రక్షించుకోవడం అరకొరగా ఉన్న హౌసింగ్ బోర్డు అధికారులకు తలకు మించిన భారంగా మారింది.

కొనుగోలు చేసి మోసపోవద్దు

హౌసింగ్‌బోర్డుకు చెందిన భూములను ఇటీవల కాలంలో అమాయక ప్రజలకు విక్రయించేందుకు కొందరు యత్నించినట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే అప్రమత్తమై పరిరక్షణ చర్యలు చేపట్టాం. ఖైత్లాపూర్ ప్రాంతంలో హౌసింగ్‌బోర్డుకు ఇంకా విలువైన భూములు ఉన్నాయి. రికార్డులు సరి చూసుకోకుండా ఎవరూ కొనుగోలు చేసి మోసపోవద్దు.

– కిరణ్‌బాబు, హౌసింగ్‌బోర్డు పశ్చిమ మండలం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

రక్షణ పరికరాలను కార్మికులు వినియోగించుకోవాలి



కార్మికులకు సబ్బులు, నూనె డబ్బాలను అందజేస్తున్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీ సిబ్బంది పనితో పాటు ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య రక్షణ పరికరాలను తప్పకుండా వినియోగించుకొని తమా ఆరోగ్యాలను కాపాడుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ వి.మమత పేర్కొన్నారు. బుధవారం ఆమె జోనల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ సిబ్బందికి సబ్బులు, నూనెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విధుల్లో కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీలు, అధికారులు పాల్గొన్నారు.

టౌన్‌షిప్ ముఖద్వారం ప్రారంభం



ముఖద్వారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని మలేషియన్ టౌన్‌షిప్ ముఖద్వారం, రెస్టారెంట్, విశ్రాంతి గదులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మలేషియన్ టౌన్‌షిప్ నివాసుల కోసం రెస్టారెంట్, విశ్రాంతి గదులు ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు.

జేపీ నడ్డా పదవి కాలాన్ని పొడిగించడం హర్షణీయం

టింగిల్కర్ నాగేశ్వరరావు

మోతీనగర్: బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా పదవి కాలాన్ని పొడిగించడం హర్షించదగ్గ విషయమని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టింగిల్కర్ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జేపీ సారథ్యంలో దేశంలో, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో విజయం ఖాయమన్నారు. పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో జేపీ నడ్డా సారథ్యం వహించి విజయం సాధించి విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జేపీ నడ్డా అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఆయన పలుమార్లు రాష్ట్రంలో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జేపి నడ్డా సారథ్యంలో ముచ్చటగా మూడోసారి ప్రధాని నరేంద్రమోదీ పదవీ బాధ్యతలు చేపట్టడం ఖాయమని పేర్కొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



పీజేఆర్‌నగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్ బతుకమ్మ పార్కు వద్ద ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సౌకర్యార్థం కంటి వెలుగు కేంద్రం వద్ద పరిసరాలను జీహెచ్‌యంసీ సిబ్బందితో శుభ్రం చేయించారన్నారు. గురువరం ఉదయం 9గంటల నుంచి ఈ కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానుందని దీన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వెలుగు ద్వారా ప్రజలందరికి కంటి స్క్రీనింగ్, దృష్టి పరీక్ష నిర్వహించడం, అర్హత ఉన్నవారికి కళ్లద్దాలను ఉచితంగా అందించడం, సాధారణ కంటి జబ్బులకు మందులను అందించడం, తీవ్రమైన వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కంటి పరీక్షల కోసం వచ్చేవారు తప్పకుండా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీకార్డును వెంట తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర రవికుమార్, డాక్టర్ మను పాపాన్, డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది రాథ, సంతోష, శశిరేఖ, స్వాతి, స్వప్న, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమం గురువారం హైదర్‌నగర్ డివిజన్లో పలు సెంటర్‌లలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్యాంపు కొనసాగుతుందన్నారు. హైదర్‌నగర్ డివిజన్‌లో ఉదయం 11.30 గంటలకు రాంనరేష్ నగర్ కమ్యూనిటీహాల్‌లో, 12 గంటలకు హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంటి వెలుగు బృహత్తర కార్యక్రమం

కేపీహెచ్‌బీకాలనీ: ముఖ్యమంత్రి కేసీఆర్ రూపొందించిన బృహత్తర కార్యక్రమం కంటి వెలుగు కేపీహెచ్‌బీ డివిజన్‌లో గురువారం ఉదయం 9గంటలకు ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ డివిజన్ 3వ ఫేజు వార్డు కార్యాలయంలో, 4వ ఫేజు మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎవరైనా కంటి సమస్యలతో బాధపడుతుంటే ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వార్డుల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

దుండిగల్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. బుధవారం దుండిగల్ 5వ వార్డులో రూ.37 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ లైన్ పనులను ఆయన స్థానిక కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... వార్డులలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థి పేపర్ ప్రజంటేషన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి దక్షిణాఫ్రికాలో పేపర్ ప్రజంటేషన్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతాగోపీనాథ్ ఆధ్వర్యంలో విఠల్‌రాథోడ్ రీసెర్చ్ చేస్తున్నాడు. ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికన్(ఈఏఎస్ఏ) వార్షిక కాన్ఫరెన్స్ ఇటీవల సెంచరీసిటీ హోటల్‌లో జరిగింది. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు ప్రసంగించారు. 'బ్లెండెడ్ లెర్నింగ్, ఏ హైబ్రిడ్ ఇన్‌స్ట్రక్షనల్ మోడల్ ఫర్ ఎఫెక్టివ్ లెర్నింగ్' అనే అంశంపై విఠల్‌రాథోడ్ పేపర్ ప్రజంటేషన్ చేశారు.

త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో సంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం బుధవారం ప్రారంభమైంది. ఈనెల 22వ తేదీ వరకు సంగీతోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం పద్మశ్రీ యెల్లా వేంకటేశ్వరరావు కచేరీ నిర్వహించారు. గాత్ర కచేరీతో సందర్శకులను అలరించారు.

ఖమ్మం సభకు తరలిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు



కూకట్‌పల్లి: ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు బుధవారం ఎమ్మెల్యేలు నాయకులు, కార్యకర్తలతో తరలి వెళ్లారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌లు బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున బయలుదేరారు. అదే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఖమ్మం బహిరంగ సభకు తరలి వెళ్లారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి
- మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హాట్‌స్పాట్లలో పర్యటన



మియాపూర్ మెట్రోస్టేషన్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

హఫీజ్‌పేట్ : నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. బుధవారం మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు చోరీలు జరుగుతున్న ప్రాంతాలలో సీసీఎస్ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మియాపూర్ పరిధిలో చోరీలు జరగకుండా నివారించేందుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నామన్నారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్రో స్టేషన్, కల్వరి టెంపుల్, న్యూకాలనీ, న్యూ హఫీజ్‌పేట్, సాయినగర్ కాలనీ, మయూరినగర్ ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించామన్నారు. ఈ పర్యటనలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, క్రైం ఏసీపీ శశాంక్ రెడ్డి, మియాపూర్ ఏసీపీ కృష్ణ ప్రసాద్, సీఐ తిరుపతిరావు, ఎస్ఐలు రవికుమార్, జగదీశ్వర్, యాదగిరిరావు, అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆఫీసర్

హఫీజ్‌పేట్ : మియాపూర్ ఆర్టీసీ డిపో–1 పరిధిలో ప్రయాణికుల సమస్యలపై గురువారం డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో సిటీ బస్సులే కాకుండా దూర ప్రాంతాలకు సంబంధించిన సమస్యలు వివరించడంలో పాటు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 9959226153 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

గాత్రంతో వాకిటి రామ్‌రెడ్డి మంత్రముగ్ధులను చేస్తారు

నందిని సిధారెడ్డి



వాకిటి రామ్‌రెడ్డికి మెమోంటో అందజేస్తున్న తెలంగాణ భాష సాంస్కృతిక మండలి సభ్యులు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌కు చెందిన మానస టూల్‌టెక్ అధినేత, ఆత్మీయ భారతి సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు ఘన సన్మానం అందుకున్నారు. మంగళవారం రాత్రి నగరంలోని తెలంగాణ సారస్వత్ పరిషత్‌లో తెలంగాణ భాష సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో గంట జలంధర్‌రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన దారిదీపాలు గ్రంథావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి చెర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథులుగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జిరసం అధ్యక్షుడు పొరెడ్డి రంగయ్య తదితరులు వాకిటి రామ్‌రెడ్డి సాహిత్య, సామాజిక రంగంలో చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ మెమోంటో, శాలువతో సత్కరించి దారిదీపాలు పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. వాకిటి రామ్‌రెడ్డి జన చైతన్య పాటలు రాయడంలో పట్టుసాధించారని, తన గాత్రంతో సభికులను మంత్రముగ్ధులు చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమములో ప్రముఖ కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రజాభారతి కవులు ఎస్.ఎన్.చారి, ఉప్పలయ్య, రవీంద్రభారతి సేవకురాలు హేమలతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ అసెంబ్లీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని చెరుకుపల్లి కాలనీలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో హన్మంతరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని 49 బూత్‌ల స్థాయి కమిటీల ఎన్నికను పూర్తి చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, పండరిరావు, జేమ్స్, గణేష్, వీరేష్ గుప్తా, శివ, గొల్ల జాన్, డివిజన్ ఏ–బ్లాక్ సెక్రటరీ బాలయ్య, మాజీ వార్డ్ సభ్యులు ఆనందరావు, సిద్దయ్య, ప్రదీప్, దిలీప్‌గౌడ్, నర్సింహారెడ్డి, వనజ, సంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ యుగపురుషుడు

విశ్వవిఖ్యాత, నట సార్వభౌమ, నటరత్న, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) వర్ధంతి సందర్భంగా బుధవారం కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఎన్‌టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యేలు, పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వేసి చిరస్థాయిగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి ఎన్‌టీఆర్ అని కొనియాడారు. నటుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. రాజకీయాలకు నూతన నిర్వచనం ఇచ్చి కోట్లాది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని పేర్కొన్నారు. తెలుగువారి కీర్తిని నలుదిక్కులా చాటి చెప్పిన యుగ పురుషుడు ఎన్‌టీఆర్ అని కొనియాడారు.

– కూకట్‌పల్లి



కేపీహెచ్‌బీకాలనీ జేఎన్‌టీయూ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎల్లమ్మబండలో నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



దీనబంధుకాలనీలో నివాళులర్పిస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామోజు శివకుమార్